

## సాగులో 'డ్రోనాస్త్రం'

- వివరాలు 8వ పేజీలో -

పైరుపై ఎగురుతుంటే గువ్వను తలపిస్తుంది. పనితీరు పరిశీలిస్తే విస్మయం కలిగిస్తుంది. అన్నదాతకు ఆసరాగా నిలుస్తోంది. వ్యవసాయాన్ని కొత్తపుంతలు తొక్కిస్తూ ఆలంబనగా ఉంటోంది. కూలీల కొరతకు పరిష్కారం చూపుతూ, పెట్టుబడి, దిగుబడుల్లోనూ చేదోడుగా రైతునేస్తంగా మారిన డ్రోన్‌పై కథనం..

## ఉవ్వెత్తున ఎగసిన 'గంగ'

ఒక్కసారిగా పది అడుగుల పైకి ఎగసిన నీటిని చూసి జనం భయకంపితులయ్యారు. ఏం జరిగిందో తెలియక గుండెలు అరచేతిలో పెట్టుకున్నారు. ఇళ్ల నుంచి పరుగులు తీశారు. శనివారం తిరుపతి మంగళం ప్రాంతంలో తెలుగు గంగ ఎయిర్ వాల్వ్ ఊడిపోవడంతో ఎదురైన పరిస్థితి ఇది. కాసేపటికి సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో ఊపిరి పీల్చుకున్నారు.



# తమిళ జాలర్ల దౌర్జన్యం

సముద్రంలో తమిళ జాలర్ల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. ఆంధ్రా సరిహద్దు భూ భాగంలోకి చొచ్చుకొచ్చి చేపలను వేటాడుతున్నారు. దీంతో 61 రోజుల చేపలవేట నిషేధం తర్వాత చేపలు పట్టేందుకు వెళుతున్న స్థానిక మత్స్యకారులు లబోదిబోమంటున్నారు.

- కోట, ఆంధ్రజ్యోతి

- ఆంధ్రా భూభాగంలోకి చొచ్చుకొచ్చి చేపలను వేటాడుతున్న వైనం
- జీవనోపాధి కరువై గుండెలు బాదుకుంటున్న స్థానిక మత్స్యకారులు



గోవిందపల్లిపాళెం వద్ద చక్కర్లు కొడుతున్న తమిళ బోట్లు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వేలాది కుటుంబాల జాలర్లు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా కోట, చిల్లకూరు, వాకాడు మండలాలకు చెందిన మత్స్యకారులు ఎక్కువగా ఉన్నారు. వీరు సాధారణ మోటరు బోట్ల సాయంతో చేపలను వేటాడుతున్నారు. అయితే ఇటీవల తమిళనాడుకు చెందిన జాలర్లు ఆధునిక మెకనైజ్డ్ బోట్ల సాయంతో ఆంధ్రా సరిహద్దు భూ భాగంలోకి చొచ్చుకొని వస్తున్నారు. ప్రధానంగా సముద్రతీరం నుంచి 8 నాటికల్ మైళ్ల మాత్రమే తమిళనాడు సరిహద్దు ఉంది. దాన్ని దాటి వారు చేపలను వేటాడుతున్నారు. వారి వద్ద అధునాతన వలలు ఉండడంతో ఒకసారి విసిరితే 10 నుంచి 20 టన్నుల చేపలు పడుతున్నాయి. స్థానిక జాలర్ల వలలకు కేజీల్లో మాత్రమే చేపలు పడుతున్నాయి. ఈ క్రమంలో చేపలను తమిళ జాలర్లు పట్టుకునిపోతుండడంతో ఆంధ్రా జాలర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. 61 రోజుల చేపల వేట నిషేధం తర్వాత సముద్రంలోకి వెళ్లినా తమిళ జాలర్లు తమ కడుపు కొడుతున్నారని వాపోతున్నారు. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో తమకు ఉపాధి కరువవుతోందని, అధికారులు స్పందించి తమిళ జాలర్లను అడ్డుకోవాలని కోట మండలం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం, చిల్లకూరు మండలం తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ మత్స్యకార గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేకపోతే తమకు వలసవెళ్లడం తప్ప తమకు వేరే మార్గం లేదని అంటున్నారు.



సముద్రం ఒడ్డున తమిళ జాలర్లు






హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే

## వెంకన్న దయతలిస్తే

# టాప్‌లో కూర్చుంటా!

### 'కింగ్‌డమ్' వేడుకలో హీరో విజయ్ దేవరకొండ

తిరుపతి అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : తిరుమల ఏడుకొండలస్వామి నా పక్కన వుండి నడిపిస్తే పోయి టాప్‌లో కూర్చుంటానని యువ హీరో విజయ్ దేవరకొండ అన్నారు.ఆయన హీరోగా నటించిన 'కింగ్‌డమ్' సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమం శనివారం రాత్రి తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రతిసారిలాగే ఈ సినిమాకు కూడా ప్రాణంపెట్టి గట్టిగా పనిచేశాం. ఇక మిగిలింది ఆ వెంకన్నస్వామి దయ, మీ అందరి ఆశీస్సులు.ఈ రెండూ నా వెంటవుంటే నన్ను ఎవరూ ఆపలేరు,సినిమా విడుదల రోజైన 31న థియేటర్‌లో మిమ్మల్ని మళ్లీ కలుస్తా, అప్పటి వరకు బాగా చూసుకో స్వామీ, ఏడుకొండలవాడా గోవిందా గోవిందా' అని చిత్తూరు యాసలో మాట్లాడుతూ యువతను ఆకట్టుకున్నారు. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ 'తిరుపతి నాకు చాలా స్పెషల్, ఇక్కడికి వస్తేనే పాజిటివ్ ఫీలింగ్ వస్తుంది, చేసింది ఒక్క సినిమానే అయినా మీరంతా నామీద చూపిస్తున్న ప్రేమ మరువలేను' అన్నారు. చక్కటి టీం వర్కుతో పనిచేశామని, కింగ్‌డం సినిమా ఆద్యంతం అలరిస్తుందని చెప్పుకొచ్చారు.క్లాస్, మాస్ వాతావరణంలో జరిగిన ట్రైలర్ రిలీజ్ మధురానుభూతినిచ్చిందన్నారు.అంతకు ముందు మూవీ ట్రైలర్ రిలీజ్ చేయగానే కుర్రకారు లేచినిలబడి కేరింతలు కొడుతూ సందడి చేశారు.యువత ఉత్సాహం మితిమీరడంతో పోలీసులు రంగంలోకి దిగి అదుపుచేశారు.దర్శకుడు గౌతమ్‌తిన్ననూరి, సంగీత దర్శకుడు అనిరుధ్, నిర్మాత నాగవంశీ తదితరులు పాల్గొన్నారు. కాగా గతంలో గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హీరో విజయ్ దేవరకొండను అరెస్టు చేయాలని గిరిజన సంఘాల జేఏసీ ప్రతినిధులు మైదానం వెలుపల ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.



విజయ్ దేవరకొండ అభివాదం

## తిరుమలలో చిరుత సంచారం

తిరుమల, జూలై26(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం చిరుత సంచారం కలకలం సృష్టించింది. తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌కు సమీపంలోని బ్యాటరీ స్టేషన్ వద్ద శనివారం రాత్రి ఓ చిరుత వాహనదారుల కంటపడింది. దీంతో భయభ్రాంతులకు గురైన వారు సమీపంలోని విజిలెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారిద్వారా ఫారెస్ట్ అధికారులు విషయం తెలుసుకుని ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే చిరుత అడవిలోకి వెళ్లిపోయింది. అయినప్పటికీ సమీపంలో చిరుత ఉంటే అడవిలోకి వెళ్లిపోయేలా సైరన్లు వేశారు. అలాగే వాహనదారులను, స్థానికులను అప్రమత్తం చేశారు.



## నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

- హాజరుకానున్న 3,654 మంది అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. దీనిపై కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. డీఆర్వో మాట్లాడుతూ జూపార్కు రోడ్డులోని చెర్లోపల్లి వద్ద ఉన్న ఐయాన్ డిజిటల్ జోన్‌లో జరిగే ఈ పరీక్షలకు 3,654మంది అభ్యర్థులు హాజరవుతారని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలూ అనుమతించరని చెప్పారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యమూ లేకుండా మౌలిక వసతులు కల్పించాలని, పరీక్షల సమయాల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటరమణ, బీవీఎస్ శేఖర్ పాల్గొన్నారు.



డీఆర్వో నరసింహులు

### తిరుమలలో సీఎస్

తిరుమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏపీ చీఫ్ సెక్రటరీ విజయానంద్ శ్రీవారి దర్శనార్థం శనివారం రాత్రి తిరుమలకు వచ్చారు. గాయత్రి గెస్ట్ హౌస్ వద్ద స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు.



# విద్యార్థినుల పట్ల పీఈటీ దాష్టీకం

- వైట్ యూనిఫాం ధరించలేదని 150 గుంజిళ్లు తీయించిన వైనం
- వాతలు పడేలా కర్రతో దాడి
- అస్వస్థతకు గురైన పలువురు విద్యార్థినులు



కాళ్లపై పీఈటీ కొట్టిన దెబ్బలను చూపుతున్న విద్యార్థినులు



విద్యార్థినులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

కోట,జూలై 26(ఆంధ్రజ్యోతి):వైట్ యూనిఫాం ధరించలేదని విద్యార్థునుల పట్ల వ్యాయామ ఉపాధ్యాయుడు దురుసుగా ప్రవర్తించారు. ఒక్కో విద్యార్థిని చేత 150 గుంజిళ్లు తీయించాడు. బూతులు తిడుతూ కర్రతో వాతలు తేలేలా చితకబాదాడు. ఈ విషయం బయటకు పొక్కనివ్వకుండా దాచినప్పటికీ పీఈటీ కొట్టిన దెబ్బలకు నొప్పులు తాళలేక విద్యార్థినులు విలపిస్తూ వార్డెన్‌కు చెప్పారు.ఇంతలో కొంతమంది విద్యార్థినులు అస్వస్థతకు గురవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కోట ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఎస్సీ బాలికల వసతిగృహంలో 160 మంది విద్యార్థినులు ఉన్నారు. వీరంతా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తగరతుల వరకు చదువుకుంటున్నారు. శనివారం ఉదయం రోజూలాగే గ్రీన్ యూనిఫారం ధరించి పాఠశాలకు వెళ్లారు. ప్రార్థన సమయంలో వైట్ యూనిఫాం వేసుకురాని విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు సుభాన్ ప్రశ్నించారు. ఇప్పటివరకు హాస్టల్‌లో వైట్ యూనిఫారం ఇవ్వలేదని విద్యార్థినులు చెప్పడంతో కోపోద్రిక్తుడైన వ్యాయామ ఉపాధ్యాయుడు 60మంది హాస్టల్ విద్యార్థినుల చేత 150 గుంజిళ్లు తీయించాడు. అంతేకాకుండా కర్రతో ఆ విద్యార్థినులను కాళ్లమీద, వెనుక భాగంలో తీవ్రంగా కొట్టాడు. కన్నీటి పర్యంతమైన విద్యార్థినులు సాయంత్రం 5 గంటలకు హాస్టల్‌కు వెళ్లారు. రాత్రి అయ్యేసరికి పీఈటీ మాస్టర్ కొట్టిన దెబ్బలకు కాళ్లు, తొడలు వాచిపోయి నొప్పులు భరించలేక విద్యార్థినులు ఏడ్పులు మొదలుపెట్టారు. విచారించిన వార్డెన్ ఉషారాణి హెచ్‌ఎం భారతిని, పాఠశాలలోని ఉపాధ్యాయులను ప్రశ్నించినా సక్రమంగా సమాధానం చెప్పలేదు. విద్యార్థినులు వెక్కివెక్కి ఎడుస్తుండటంతో దళిత సంఘాల నాయకులు, టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్, సురేష్ హాస్టల్‌కు వెళ్లి విద్యార్థినులను విచారించారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను 108 వాహనంలో కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగిలిన విద్యార్థులకు వార్డెన్ ఉషారాణి ఆధ్వర్యంలో వసతి గృహంలోనే చికిత్స అందించారు. ఎంఈవో మస్తానయ్య హాస్టల్‌కు చేరుకుని విచారణ చేపట్టారు.

## గజదాడులకు మరో రైతు బలి

- ఏనుగుల తిష్టతో బిక్కుబిక్కుమంటున్న గ్రామీణ జనం



రామకృష్ణమరాజు మృతదేహం

పుంగనూరు/సోమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): మదపుటేనుగుల దాడిలో మరో రైతు ప్రాణాలు కోల్పోయాడు. పొలం వద్ద ఉన్న నీటి డ్రమ్ము ఇంటికి తెచ్చుకోవడానికి వెళ్లిన రైతుపై ఏనుగుల గుంపు దాడి చేసి హతమార్చిన సంఘటన శనివారం రాత్రి సోమల మండలంలో జరిగింది. ఆవులపల్లె పంచాయతీ కొత్తూరుకు చెందిన చెన్నూరి రామకృష్ణమరాజు అలియాస్ బాబు (46) గ్రామ సమీపంలోని పొలంలో టమోటా సాగు చేశాడు.మూడురోజులుగా ఆవులపల్లె పంచాయతీలో 16 ఏనుగుల గుంపు సంచరిస్తూ పంటలు ధ్వంసం చేస్తుండడంతో రైతులు త్వరగా పొలాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్నారు.శుక్రవారం రాత్రి రామకృష్ణమరాజు పొలంలోని కొబ్బరిచెట్లతో పాటు టమోటా తోటలో ఏనుగులు సంచరించి తొక్కినాశనం చేశాయి. రామకృష్ణమరాజు పొలంలో పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారి చేయడానికి ప్లాస్టిక్ డ్రమ్ము ఉంచాడు. ఏనుగులు తొక్కి నాశనం చేస్తాయోమోనని డ్రమ్మును ఇంటికి తీసుకురావడానికి రామకృష్ణమరాజు గ్రామానికి చెందిన సంజీవరాజు, రాజారెడ్డిలను తోడు పెట్టుకుని శనివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. డ్రమ్ములో నీటిని కింద పోస్తుండగా ఏనుగుల గుంపు దాడి చేసి కిందపడేసి తొక్కి చంపేసింది. ఏనుగుల ఘీంకారాలను గుర్తించిన రాజారెడ్డి, సంజీవరాజు భయంతో హుటాహుటిన ద్విచక్రవాహనంలో గ్రామానికి చేరుకుని సమాచారం ఇచ్చారు. రామకృష్ణమరాజు కుటుంబీకులతో పాటు గ్రామస్తులంతా కలసి సంఘటనాస్థలానికి వెళ్లారు. రామకృష్ణమరాజు మృతదేహం వద్దే ఏనుగుల గుంపు తచ్చాడడం చూసి భయంతో వెనుదిరిగారు. రాత్రి 10 గంటల సమయంలో ఏనుగులు వెళ్లిపోవడంతో రామకృష్ణమరాజు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చారు. రామకృష్ణమరాజు మృతితో ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు తమకింక దిక్కెవరని రోదించడం చూసి గ్రామస్తులు కూడా కళ్లనీళ్లు పెట్టుకున్నారు.

## బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతుడై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు పూర్తయ్యాక ఉత్సవర్లను కల్యాణ మండపంలో వేంచేపు చేసి, ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించాక విశేషంగా అలంకరించారు. బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేశారు. స్వామి ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి పాల్గొన్నారు.

## పీ-4 మార్గదర్శకులను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

రామచంద్రాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం దారిద్ర్య రేఖ దిగువన ఉన్న కుటుంబాల అభివృద్ధికి మార్గదర్శకులను గుర్తించాలని ఆర్డీవో రామ్మోహన్ కోరారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీ4 సర్వే ద్వారా గుర్తించిన 1,247 బంగారు కుటుంబాల అభివృద్ధికి కావాల్సిన అవసరాలను గుర్తించాలన్నారు. మండంలో ఎన్ఆర్ఐలు, ఆర్థిక వేత్తలు, భూస్వాములు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సంఘ సేవకులను ఆగస్టు 4వ తేదీలోపు మార్గదర్శకులుగా గుర్తించాలన్నారు. వారితో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, డీటీలు అన్వర్‌బాషా, అమృత, యుగంధర్, డిప్యూటీ మండల స ర్వేయర్ తరుణ్, వీఆర్వో ప్రదీప్‌నాయుడు, రమాదేవి, రూప పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బింధుమాధవి

రామచంద్రాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): సంక్షేమ చర్యలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ ఎంపీపీ బింధుమాధవి అన్నారు. శనివారం అనుపల్లి పంచాయతీ రేఖల చేనులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సీఎం చంద్రబాబునాయుడు ఏడాది పాలనలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు విజయకుమార్‌రెడ్డి, దేవరాజులు, మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, మహేష్, జవహర్‌రాయల్, కుమార్, జగదీష్‌రాయల్, లోకేష్ పాల్గొన్నారు.

## సింగిల్ విండో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం



రఘునాథను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఎర్రావారిపాలెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా శిరివేలు రఘునాథ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆగ్రహారానికి చెందిన ఈయన బాధ్యతల స్వీకార కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. రఘునాథతో పాటు డైరెక్టర్లుగా పల్లె పాక నాగరాజు,దేవేంద్రనాయుడులు బాధ్యతలు చేపట్టారు. తమను ఈ పదవికి ఎంపికచేసిన ఎమ్మెల్యే నానికి రుణపడి ఉంటామని వీరు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దేశిరెడ్డి రఘునాథ, మహేష్ నాయుడు, శివరామిరెడ్డి, రాజశేఖర్ నాయుడు,శ్రీదర్ బాబు, హేమరత్నం తదితరులు పాల్గొన్నారు. పాలొంగన్నారు.

## ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు

పాకాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మొగరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కార్గిల్ విజయ దివస్ జరుపుకొన్నారు. యుద్ధంలో పాణాలు అర్పించిన వీర సైనికులకు నివాళులు అర్పించారు. కార్గిల్ యుద్ధం విజయగాథలను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సమలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**చంద్రగిరి:** చంద్రగిరిలో కార్గిల్ యుద్ధ వీరులకు బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. టవర్ క్లాక్ వద్ద జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకటమని మాట్లాడుతూ సైనికుల ప్రాణ త్యాగాలను మరవకూడదన్నారు. అనంతరం కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు సుబ్రహ్మణ్యం యాదవ్, కాకి మాను మునిరాజు, ఇందుశేఖర్ ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## శ్రమజీవుల పక్షాన పోరాటం: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న హరినాథరెడ్డి

చంద్రగిరి, జూలై 26(ఆంధ్ర జ్యోతి): పేదలు, శ్రమజీవులకు సీపీఐ అండగా నిలుస్తుందని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథరెడ్డి అన్నారు. శనివారం చంద్రగిరిలో సీపీఐ మండ మహాసభ రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హరినాథరెడ్డితోపాటు పార్టీ జిల్లా కార్యదర్శి మురళి హాజరయ్యారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో తమపార్టీ పాత్ర గురించి వివరించారు. పేదలకు ఇళ్లు, భూముల కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు విశ్వనాథ్, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీరాములు, ఎన్‌డి రవి, కేవై రాజా, శివ, గోవిందస్వామి, పద్మనాభం, మహేంద్ర, వైఎస్ మణి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బలి బండి ఘట్టం



భాకరాపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): భాకరాపేటలో మహాభారత ఉత్సవాలలో భాగంగా శనివారం బలి బండి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్టత ఉంది. పూర్వం రాక్షసుడు ఓ గ్రామంపై పడి ప్రజలను ఆహారంగా తీసుకుంటుంటాడు.దీంతో భీముడు బలి బండిపై వెళ్లి యుద్ధం చేసి సంహరిస్తాడనేది ఇతిహసగాథ. ఈ ఘట్టంలో భాగంగా భీముడి వేషధారి గ్రామంలో బలిబండిపై ఆహార పదార్థాలను తీసుకెళ్లి రాక్షసునితో యద్ధం చేసిన తీరు విశేషంగా అలరించింది.

**తిరుపతి రూరల్:** దుర్గసముద్రంలో ధర్మరాజస్వామి వార్షిక మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రదర్శించి బకాసురవధ నాటిక అలరించింది. అంతకుముందు ఆలయం వద్ద ప్రత్యేకంగా అలకరించిన ఎడ్లబండిపై భీముడి వేషధారి కొలువుదీరి డప్పులు..వాయిద్యాల నడుమ ఉభయదాత దేశిరెడ్డి ఇంటి వద్దకి వెళ్లారు. అక్కడ సాంప్రదాయంగా ఎడ్లబండి, భీముని వేషధారికి పుష్పాలంకరణ చేశారు. అనంతరం గ్రామోత్సవంగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆలయధర్మకర్త మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, జయకుమార్‌యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్..!

తిరుపతి రూరల్, జూలై26(ఆంధ్రజ్యోతి): రామానుజపల్లెలో వాటర్‌పైపులైన్‌కి లీకేజీ సమస్య ఏర్పడడంతో గుంతతీసి వదిలేయడంపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో పట్టించుకోండి సారూ..! అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై మండల అధికారులు స్పందించారు. శనివారం ఉదయం డిప్యూటీ ఎంపీడీవో దయాసాగర్, ఇతర మండలస్థాయి అధికారులు గ్రామాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. వెంటనే మరమ్మతులు పూర్తిచేసి గ్రామంలో నీరుసరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. దీంతో సర్పంచ్ చొరవతీసుకుని మధ్యాహ్నానికల్లా మరమ్మతుల పనులు పూర్తి చేశారు. నీరు సరఫరా కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఆకట్టుకున్న మహాభారత యుద్ధ ఘట్టం

రామచంద్రాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రామాపురం మహాభారత ఉత్సవాల్లో భాగంగా భగవతారిణి అనసూయ ప్రదర్శించిన మహాభారత యుద్ధ సంగ్రామం ఆకట్టుకుంది. తొలుత ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి మూలమూర్తులకు తిరుమంజనం చేశారు. ప్రత్యేకంగా అలకరించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించనున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమాన్ని ప్రదర్శించనున్నారు. రాత్రి అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## స్విమ్స్ శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి విరాళం



ఆర్వీకుమార్‌కు చెక్కు అందజేస్తున్న రాఘవేంద్ర

తిరుపతి(వైద్యం), జూలై 26(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి హైదరాబాదుకు చెందిన కృష్ణ అగర్వాల్ రూ.1,00,116 లను విరాళంగా అందించారు. దాత కోరిక మేరకు ఆయన మిత్రుడు రాఘవేంద్ర స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను శనివారం ఆయన చాంబర్‌లో కలిసి చెక్కును అందించారు. దాతకు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## అమరవీరులకు ఘన నివాళి

తిరుపతి(విద్య), జూలై26(ఆంధ్రజ్యోతి): కపిలతీర్థం సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద శనివారం కార్గిల్ విజయదివస్‌ని నిర్వహించారు. దీనిలో భాగంగా పలువురు బీజేపీ నాయకులు హాజరై కార్గిల్ అమరవీరులకి నివాళి అర్పించారు. గుండాల గోపీనాథ్ రెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుధాకర్, మస్తాన్, ప్రభాకర్‌నాయుడు, సురేష్ స్వామి, కళాకారులు చంద్రబాబునాయుడు, కేశవులరెడ్డి, శాంబోల హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రాష్ట్ర బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 26(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వ ర్యంలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్య దర్శి రామకృష్ణయ్య తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ముఖ్య అతిథు లుగా మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ చైర్మన్ రవినాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్, నగరపాలక సంస్థ కమిషర్ మౌర్య హాజరు కానున్నట్లు తెలిపారు.

## మఠం భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 26(ఆంధ్రజ్యోతి): మఠం భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో విచ్చలవిడిగా తమ అనుకూల వర్గానికి మఠం భూములు దారాదత్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హరిహర వీరమల్లు విజయోత్సవాలు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు విజయం సాధించిన సందర్భంగా తిరుపతిలో శనివారం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు రాజారెడ్డి, నాయకులు బాబ్జి, సుమన్‌బాబు, పగడాల మురళి, రాజేస్ ఆచారి, మనోజ్, రమేష్‌నాయుడు, తదితరులు మీడియా సమావేశం నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రాజారెడ్డి మాట్లాడుతూ వైసీపీ వారు తప్పుడు ప్రచారాలు చేసినా హరిహర వీరమల్లు విజయం సాధించడం సంతోషకరమన్నారు.

## నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి(ఆటోనగర్), జూలై26(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఆదివారం తమ విద్యుత్ వినియోగ బిల్లులను చెల్లించ వచ్చని ఆ సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి విద్యుత్ సర్కిల్ పరిధిలో తమ రెవిన్యూ కార్యాలయాల్లో ఆదివారం ఉద్యోగ సిబ్బంది విధుల్లో ఉంటారని వివరించారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నిరసన

సత్యవేడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ మండలం లోని మదనంబేడులో సీపీఎం డివిజన్ కార్య దర్శి రమేష్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కడుపుకొట్టి, అదాని కంపెనీకి లాభాలు తెచ్చిపెట్టేందుకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వా లు ఆరాటపడుతున్నాయని విమర్శించారు.

## మురుగుతో ముప్పుతిప్పలు



ఇళ్లమధ్య ఖాళీస్థలంలో చేరిన మురుగునీరు

తిరుపతిరూరల్, జూలై26(ఆంధ్రజ్యోతి): పేరూరు పంచాయతీ పరిధిలో జాతీయరహదారిని ఆనుకుని జీవోస్‌కాలనీ, జర్నలిస్ట్‌కాలనీలకు సమీపంలోని ఇళ్లమధ్య ఖాళీస్థలంలో మురుగు నీరు ఇబ్బందికరంగా మారింది. ఓ అపార్ట్‌మెంట్‌కి సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల మురుగునీటిని, టాయిలెట్ వ్యర్థాలని కూడా పక్కనే ఉన్న ఖాళీ ప్లాట్‌లోకి వదిలేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్‌మెంట్‌కి సీవేజ్ ఎండ్‌పాయింట్‌పై తుడా అధికారులు పరిశీలించకుండానే అనుమతులు ఇవ్వడంతో సమస్య ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. కాగా జీవోస్ కాలనీలో ఇటీవల ఎమ్మెల్యే పులివర్తినానీ చొరవతో రూ.25లక్షలతో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఈ అపార్ట్‌మెంట్‌కి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అవకాశం లేకపోవడంతో పనులు చేపట్టలేదని తెలిసింది. పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా ఖాళీప్లాట్, అపార్ట్‌మెంట్ యజమానులకు సోమవారం నోటీసులు జారీ చేస్తామన్నారు.

## పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే నాని





టీడీపీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

పాకాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా మండలంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు., సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో నాయకులందరూ కలిసికట్టుగా పాల్గొనాలన్నారు. పులివర్తివారిపల్లెలో శనివారం ఆయన రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, మండల సీనియర్ నాయకులు, గ్రామకమిటీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్, తారు రోడ్లు మంజూరు చేశామన్నారు. ఉపాధి హామీ పథకం సద్వినియోగంపై అవగాహన కల్పించారు. శ్మశాన వాటికలు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపామన్నారు. చెరువులను అనుసంధానం చేసి గాలేరు. నగరి నీళ్లను దావులచెరువు గుండ్లగుట్టపల్లె వాటర్ స్టోరేజ్ ద్వారా వినియోగించుకునేలా ప్రతిపాదించామన్నారు. త్వరలో పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, కార్యదర్శి ఫల్గుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఇటీవల తల్లిని కోల్పోయిన క్రమంలో ఎమ్మెల్యే పులివర్తి నానీని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి, సీపీఎం నాయకుడు కందారపు మురళిలు పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## రేపట్నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీలు



మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర, పక్కన మండలస్థాయి అధికారులు

తిరుపతిరూరల్, జూలై26(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో సోమవారం నుంచి జరుపతలపెట్టిన ఉపాధిహామీ పథక సామాజిక తనిఖీకి క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి సహకారం అందించాలని ఎంపీడీవో రామచంద్ర సూచించారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో శుక్రవారం సామాజిక తనిఖీ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. 2024 ఏప్రిల్1 నుంచి ఈఏడాది మార్చి31వరకూ మండలంలో రూ.12.36కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో సోషల్ ఆడిట్ చేపట్టనున్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ..ప్రతిపంచాయతీలో డీఆర్పీల నేతృత్వంలో మూడు రోజులపాటు ఆడిట్ జరుగుతుందన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించాలన్నారు. మండల ఏపీవో జ్యోతిశ్రీ, హౌసింగ్ ఏఈ శ్రీరాములురెడ్డి, పీఆర్ ఏఈలు రాజామస్తానయ్య, ఉదయ్‌కుమార్, హిమంత్‌కుమార్, కార్యదర్శులు,, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## చిరుతల కోసం వర్సిటీలో మూడు బోనుల ఏర్పాటు



నాగభూషణం

మంగళం, జూలై 26(ఆంధ్రజ్యోతి): అలిపిరి నుంచి జూపార్కు వైపు పోవు మార్గంలో ఆహార వ్యర్థాల వల్లే చిరుతలు వస్తున్నాయని తిరుపతి సబ్ డీఎఫ్‌వో నాగభూషణం తెలియజేశారు. శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనదారుడిపై చిరుత దాడిచేసిన నేపథ్యంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జూపార్క్ రోడ్డులో టిఫిన్, చిరుతిండ్ల వ్యాపారాలు చేసుకునేవారు వ్యర్థాలను పరిసరాల్లో పడవేస్తున్నారని తెలియజేశారు. ఆ వ్యర్థాల కోసం కుక్కలు రావడంతో వాటికోసం చిరుతలు వస్తున్నాయని వివరించారు. ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలోకి చిరుతపులులు వారం రెండు వారాలకు ఒకసారి వచ్చి కుక్కలను వేటాడుతున్నాయన్నారు. అలిపిరి నుంచి జూపార్కు వరకు శానిటేషన్ బాగు చేసి ఆ ప్రాంతంలో తిరుగుతున్న మూడు చిరుతపులులను బంధించడానికి ఇప్పటికే మూడు బోన్లు ఏర్పాటుచేశామన్నారు. ఆ మార్గంలో ద్విచక్ర వాహనదారులు గుంపులుగా ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తిరుమల అటవీ ప్రాంతంలో 20 చిరుతపులులు, వాటి పిల్లలు ఉన్నాయని వివరించారు.

## రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయండి



అరవింద కంటి ఆస్పత్రిలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు సీఈవో దినేష్‌కుమార్

తిరుపతి(వైద్యం), జూలై 26(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ వైద్యసేవలు అందించడంతోపాటు వారి వివరాలను ఎప్పటికప్పుడు తప్పక ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు సీఈవో దినేష్‌కుమార్ సూచించారు. జూపార్కు రోడ్డులోని ఎస్వీ అరవింద కంటి ఆస్పత్రిని ఆయన శనివారం తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్‌వర్ధన్ ఉన్నారు.

## యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ఆందోళన

తిరుపతి(కలెక్టరేట్), జూలై 26(ఆంధ్రజ్యోతి): బదిలీ అయిన టీచర్ల జీతాల సమస్య పరిష్కరించాలని, పాఠశాలల్లో బోధనేతర పనులు తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్‌నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రామచంద్రయ్య, నిర్మల, కుమారస్వామి, గీతమ్మ, సురేష్, వెంకటకృష్ణ, పద్మజ, చంద్రశేఖర్, గుణశేఖర్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు.సాయంత్రం ఉభయ నాంచరులతో వెంకన్నను సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి ఊయలపై అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతి, ఆండాల్ సమేత సర్వాలంకార భూషితుడైన ప్రసన్న వేంకటేశ్వరుడిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు.ఆలయ అధికారి వేణుగోపాల్‌రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో శివకుమార్,నాయకులు

భాకరాపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని చిన్నగొట్టిగల్లు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ అన్నారు. లంకిపల్లివారిపల్లె, బొల్లినేనివారిపల్లె గ్రామాల్లో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, ప్రకాశ్, రాజగోపాల్ నాయుడు, వెంకటసుబ్బయ్య, బెల్లంకొండ రమణ, సురేంద్ర నాయుడు, జైచంద్ర నాయుడు, చిట్టిబాబు, రఫీ, మల్లికార్జున, రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో గిడ్డయ్య

భాకరాపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఆయన పీ4 సర్వేపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4 కోసం నిరుపేద బంగారు కుటుంబాలుగా గుర్తించాలన్నారు. వారిని ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వారు దత్తత తీసుకునేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. తహసీల్దారు భాగ్యలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి, సూపరింటెండెంట్ సతీశ్, ఏవో ధనలక్ష్మి, ఎంఈవో-2 గోపీనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, హౌసింగ్ ఏఈ వరముని, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో విధులకు ..



తాగి పడిపోయిన ఉద్యోగి

తిరుపతి(వైద్యం), జూలై 26(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రమేష్ శనివారం రాత్రి 8 గంటలకు పూటుగా మద్యం సేవించి విధులకు హాజరయ్యాడు. విధులకు వచ్చిన వెంటనే గదిలోనే స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే అత్యవసర విభాగానికి తరలించారు. మద్యం సేవించినట్లు వైద్యుల పరీక్షల్లో తేలింది. సూపరింటెండెంట్ రాధ ఆస్పత్రికి చేరుకొని రమేష్‌పై తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## చెంగాళమ్మ జాతర

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 26 (ఆంధరజ్యోతి): మండలంలోని నీర్పాకోటలో కొలువై ఉన్న చెంగాళమ్మ జాతర రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేసిన ముగ్గు ఆకట్టుకుంది. జాతర సందర్భంగా చెంగాళమ్మకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ముక్కంటి క్షేత్రం... పోటెత్తిన భక్తజనం



శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 511 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,304, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,447మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,696 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,092, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 325, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 310, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 103మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,800 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## పరీక్షల విభాగంలో వీసీ తనిఖీలు


తనిఖీ చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరీక్షల విభాగంలో వీసీ అప్పారావు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సిబ్బంది సమయపాలన పాటించని వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవినీతికి చోటు లేకుండా పరీక్షల విభాగంలో ఉద్యోగులు పారదర్శకంగా సేవలు అందించాలని ఆయన సూచించారు. త్వరలో చేపట్టే పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## ఈఈఈ విభాగ విద్యార్థి అసోసియేషన్ ఏర్పాటు


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఈఈఈ విభాగ విద్యార్థి అసోసియేషన్ ఏర్పాటైంది. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా హిమబిందు, శృతి, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్‌గా నర్మిత, సిరి, శ్వేత, సంగణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అమరరాజా కంపెనీకి చెందిన డాక్టర్ శ్రీధర్ నాయుడు, ప్రిన్సిపాల్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## కార్గిల్ వీరులకు ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాల యాలు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ వీరులకు ఘన నివాళి అర్పించారు. పద్మావతి డిగ్రీ కాలేజీ ఎన్‌సీసీ శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, వైస్ ప్రిన్సిపాల్ భద్రమణి, తదితరులు కార్గిల్ వీరుల చిత్ర పటాలకు ఘన నివాళి అర్పించారు. కార్గిల్ యుద్ధంలో 527 మంది సైనికులు ప్రాణ త్యాగం చేశారని కీర్తించారు. మన దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలను మరవరాదన్నారు. అధ్యాపకులు విద్యుల్లత, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

## థియేటర్ పారిశుధ్య కార్మికులకు చీరల వితరణ



తిరుపతి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): హరిహర వీరమల్లు చిత్రం భారీ విజయం సాధించడంతో స్థానిక సంధ్య థియేటర్‌లో శనివారం మధ్యాహ్నం జనసైనికులు, అభిమానులు ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. పవన్‌కల్యాణ్ అభిమానులు, జనసైనికులు థియేటర్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు చీరలను వితరణ చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత కిరణ్‌రాయల్ మాట్లాడుతూ అన్ని కులాలు, మతాల వారు చూడాల్సిన సినిమా హరిహరవీరమల్లు అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ విశ్రాంత డిప్యూటీ ఈవో చిన్నంగారి రమణ, మనోజ్, సాయిదేవ, సాయి, రవిశంకర్‌యాదవ్ పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన

### ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన


నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు, కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి శనివారం క్రమం తప్పకుండా సాగుతున్న నగర సంకీర్తన అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ వారం కూడా నిర్వహించారు. భక్తులు, కళాకారులు సంప్రదాయ వేషధారణలో తిరునామం ధరించి గోవిందరాజస్వామి ఆలయ మాడ వీధుల్లో ఈ ప్రదర్శన సాగింది. భజన కళాకారులు నిర్వహించిన కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మేకల గంగయ్య, వాసుదేవరెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి, కొండే చెంగారెడ్డి, మునినాథరెడ్డి, భాస్కరాచారి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మునిరత్నమాచారి, మధు, విక్రం, అరుణ, జయమ్మ, పార్వతి, మునేంద్రరెడ్డి,కోటి, మునికృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, కల్పన పాల్గొన్నారు.

## ప్రసూతి ఆస్పత్రిలో అతిక్లిష్టమైన సర్జరీ

### గర్భిణి కడుపులో కణితి తొలగింపు



తిరుపతి(వైద్యం), జూలై 26(ఆంధ్రజ్యోతి): 46 ఏళ్ల మహిళ గర్భం నుంచి ముఖద్వారం వరకు వ్యాపించిన అతిపెద్ద కణితిని అతిక్లిష్టమైన సర్జరీ చేసి తొలగించి ఆమె ప్రాణాలు కాపాడామని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల శనివారం తెలిపారు. ఆమె ఆస్పత్రిలో మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నెల్లూరు జిల్లాకు చెందిన 46 ఏళ్ల మహిళ తీవ్ర కడుపునొప్పి సమస్యతో ఆస్పత్రికి రావడంతో ఆమెకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించా మన్నారు. కణితి ఉన్నట్లు గుర్తించారన్నారు. నిపుణులైన వైద్యుల సాయంతో సర్జరీ చేసి ఆ కణితిని తొలగించామని తెలిపారు. సాధారణంగా ఇటువంటి సర్జరీలకు ప్రవేటు ఆస్పత్రుల్లో రూ.2 లక్షలకు పైగా ఖర్చవుతుందని అటువంటిది ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా, విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రస్తుతం మహిళ పూర్తి ఆరోగ్యంగా కోలుకుంటోందని తెలియజేశారు.

## యోగాతో ఆరోగ్యం


కార్యక్రమంలో పాల్గొన్న స్వామి పరమార్థదేవ్, వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాల యాలు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం పెంపొందుతుందని హరిద్వార్‌లోని పతంజలి యోగా సమితి ముఖ్య కేంద్ర సమన్వయకర్త స్వామి పరమార్థదేవ్ పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో యోగా గురించి శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యోగా మనిషి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో యోగాకు ప్రాముఖ్యత పెరగాలన్నారు. సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి , యోగా విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.






'జనరల్ బోగీలు' నాటకంలో ఓ సన్నివేశం

# జనరల్ బోగీ ప్రయాణం నరక యాతనే..!

### సాధారణ పౌరుల జీవన యానాన్ని చూపిన 'జనరల్ బోగీలు' సాంఘిక నాటకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): సామాన్యుల జీవితాలను ప్రతిబింబించేలా ప్రదర్శించిన 'జనరల్ బోగీలు' నాటకం ఆకట్టుకుంది. మహతి కళా క్షేత్రంలో సాగుతున్న అభినయ ఆర్ట్స్ 25వ జాతీయ నాటకోత్సవాలలో భాగంగా శనివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా కొలకలూరి వారి 'శ్రీసాయి ఆర్ట్స్' ఆధ్వర్యంలో 'జనరల్ బోగీలు' సాంఘిక నాటిక ప్రదర్శన సాగింది. నాటకాన్ని పీటీ మాధవ్ రాశారు. దర్శకులుగా గోపరాజు విజయ్ వ్యవహరించారు. జనరల్ బోగీల సంఖ్య తగ్గించడంతో ఫుట్ పాత్ మీద, టాయ్‌లెట్స్ వద్ద కూడా కూర్చుని జనం ప్రయాణిస్తుంటారు. జనరల్ బోగీల్లో ప్రయాణికులకు గుర్తింపు కార్డులు జారీ చేస్తే, ప్రమాద సమయాల్లో మరణిస్తే కుటుంబాలకు ఏమైనా సహాయం అందవచ్చునని సావిత్రమ్మ అనే ఉద్యమకారిణి పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపడుతుంది. రైలు ప్రమాదానికి గురై కనిపించకుండా పోయిన కొడుకు కోసం హైకోర్టులో పిల్ వేస్తుంది. దీంతో ఆమెను ఆమెను అరెస్టు చేయాలని భావిస్తారు. సావిత్రమ్మకు అందరి మద్దతు అవసరమని ఈ నాటకం కోరుతుంది. ఈ నాటకంలో సావిత్రమ్మ పాత్రలో సురభి ప్రభావతి, హెడ్ కానిస్టేబుల్‌గా విజయమోహన్, రైల్వే పోలీసుగా మధు, గోపరాజు విజయ్ సీఐగానూ, వినయ్ లాయర్‌గా తమపాత్రలకు జీవం పోశారు. గోపరాజు కార్తికేయ, నాగు, థామస్ సంగీత, సాంకేతిక సహకారం అందించారు.

#### భక్తులపై శ్రీవారి దయను చూపిన 'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం'

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి గొప్పతనం, భక్తులపై శ్రీవారు చూపించే కరుణ, దయలను కర్నూలుకు చెందిన టీజీవీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం' పద్య నాటకం భక్తులను మెప్పించింది. ఈ నాటకాన్ని ఎంవీఎల్ఎన్ ప్రసాద్ రాశారు. వీవీ రమణారెడ్డి దర్శకత్వం వహించారు. ఈ నాటకంలో వేంకటేశ్వరుడి పాత్రలో రాజశేఖర్‌రావు, రామానుజాచార్యుడిగా సుబ్బయ్య, తిరుమలనంబిగా రమణారెడ్డి, అనంతాచార్యులుగా మోహన్ నాయక్, రంగనాథుడుగా రామకృష్ణ, వేంకట నాథుడుగా గడిగె రవి, మాధవుడుగా చెన్నప్ప, మధుసూదనుడుగా శ్రీనివాస్, అలివేలుమంగగా సురభి వెంగమాంబ, మహాలక్ష్మిగా సురభి హారిక పాత్రలు పోషించారు. వేంకటేశ్వర్లు-సంగీతం, శ్రీనివాసాచారి -కీబోర్డు, మహేష్-తబల, శ్రీనివాసులు టీం-అలంకరణ వంటి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ అధ్యక్షులు మబ్బు సూర్యనారాయణరెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏనుగు అంకమ నాయుడు, తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షులు వేణుగోపాల రెడ్డి, ప్రేక్షకులు పాల్గొన్నారు.

#### చక్కని తల్లికి చాంగుభళా..!

ఉదయం కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు అదరహో అనిపించాయి. పలువురు సంకీర్తనాచార్యుల కీర్తనలకు, జానపద గేయాలకు అనుగుణంగా పలువురు కళాకారులు అత్యద్భుత నృత్య ప్రదర్శనలతో ఆహూతులను అలరించారు. కళాకారులందరినీ అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎన్ రెడ్డి జ్ఞాపికలతో సత్కరించారు.

#### నేడు హనుమ అవార్డుల ప్రదానోత్సవం

ఆదివారం ఉదయం 9:30 గంటలకు కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5 గంటలకు హైదరాబాదుకు చెందిన విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్వేచ్ఛ' సాంఘిక నాటిక ప్రదర్శించనున్నారు. రాత్రి 7 గంటలకు హనుమ అవార్డుల ప్రదానోత్సవం ప్రారంభం కానుంది.

#### నేటితో ముగియనున్న నాటకోత్సవాలు

నాటకోత్సవాలు ఆదివారం ముగియనున్నాయి. కళాకారులను, సహాయకులను, గురువులను సన్మానించనున్నారు.


'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం' నాటకంలోని సన్నివేశం







## ఘనంగా టేప్ ఎక్స్‌పో-25 ప్రారంభం



తిరుపతి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎయిర్ బైపాస్‌రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌ల్లో ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్(టేప్)ఆధ్వర్యంలో శనివారం టేప్ ఎక్స్‌పో-25 ఘనంగా ప్రారంభమైంది. జిందాల్ స్టీల్స్ సౌజన్యంతో వివిధ సంస్థలకు సంబంధించిన నిపుణులతో దాదాపు 70స్టాల్స్ ఏర్పాటుచేశారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డెవలప్మెంట్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ ఈ ఎక్స్‌పోను ప్రారంభించి ప్రసంగించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్టాల్స్ ఏర్పాటు చేయడం, విశిష్ట నిపుణులు పాల్గొనడం శుభపరిణామమన్నారు. ఇల్లు నిర్మించుకునేవారికి వాటర్‌ట్యాంకులు, ఆర్‌సీసీ స్లాబుల లీకేజీ నిర్మూలన కోసం పరిష్కారాలు ఉన్నాయని, ఖాళీస్థలాలు, అపార్టుమెంట్ల కొనుగోలుదారులకు మంచి వేదిక అని కొనియాడారు. నగరవాసులు, పరిసర ప్రాంతప్రజలు టేప్ ఎక్స్‌పోను సందర్శించి సాంకేతిక విషయ పరిజ్ఞానాన్ని పొందవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పి.హరిప్రసాద్, వన్నెకుల క్షత్రియ డెవలప్మెంట్ చైర్మన్ సి.ఆర్.రాజన్, డిప్యూటీ మేయర్లు ఆర్.సి.మునికృష్ణ, ముద్రనారాయణ, జిందాల్ స్టీల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నవోదయకి విశ్వం విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

తిరుపతి(విద్య), జూలై26(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి విడుదల చేసిన మూడోజాబితాలో తమ విద్యార్థులు పలువురు ఎంపికైనట్లు తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. కె.అశ్విన్,డి.రిషిత్, డి.జైదీప్ రెడ్డి, రియాన్స్ తేజస్, అఖిల్, అంజలి, చరణ్‌తేజ, హర్షిత్‌సాయి, దివ్య, వరప్రసాద్, అరవింద్, వేదాంత్, తనుశ్రీ, సోనూకుమార్, మమత శోభన్, హేమశిఖ ఎంపికైనట్లు తెలిపారు. వీరితో కలిపి మొత్తంగా 69మంది విద్యార్థులు నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించారన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు. 2026నవోయద ప్రవేశపరీక్షా దరఖాస్తుల కోసం వరదరాజనగర్‌లోని విశ్వం స్కూల్ లేదా 8688888802/03, 9399976999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు.

## శ్రీవారికి బ్యాటరీ వాహనాల విరాళం


పెంచలకోన ప్రధాన ఆలయం ముందు దాతలు అందచేసిన బ్యాటరీ వాహనాలు - ఆలయ ఈవోకు నగదు అందజేస్తున్న జొన్న శ్రీకాంత్

రాపూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన దేవస్థానానికి తిరుపతి వాస్తవ్యులు, టీటీడీ విశ్రాంత ఉద్యోగి ఎం సుబ్రహ్మణ్యం, ఎం సుశీల దంపతులు సుమారు రూ.12లక్షల విలువ గల 2 బ్యాటరీ వాహనాలను శనివారం విరాళంగా అందజేశారు. ప్రత్యేక పూజలు జరిపి ఆలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉపకమిషనర్ పి శ్రీనివాసులురెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**● నిత్యాన్నదానానికి రూ. 2లక్షల విరాళం**

పెంచలకోనలోని శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం తిరుపతి విజయపురి కాలనీకి చెందిన జొన్న వెంకయ్య, వెంకటసుబ్బమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు జొన్న శ్రీకాంత్ దంపతులు రూ.2లక్షల నగదు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి ప్రసాదాలు అందచేశారు.

## రేపు జిల్లాస్థాయి అండర్ -13 చదరంగం పోటీలు

తిరుపతి(క్రీడలు), జూలై26(ఆంధ్రజ్యోతి): స్థానిక యూత్‌హాస్టల్లో ఈ నెల 28న జిల్లాస్థాయి అండర్-13 చదరంగం పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ హెచ్.శ్రీనివాసమూరి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హతసాధిస్తారు. 01-01-2012తరువాత జన్మించి ఆసక్తిగల క్రీడాకారులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీచెస్.ఓఆర్‌జీలో పేర్లు నమోదుచేసుకోవాలి. వివరాల కోసం 98 85238474నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

## పంచగవ్య ఉత్పత్తులతో ఆరోగ్యంతో పాటు ఆదాయం


కార్యక్రమంలో పాల్గొన్న హర్షభార్గవి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 26 (ఆంధ్రజ్యోతి): పంచగవ్య ఉత్పత్తులతో ఆరోగ్యంతో పాటు ఆదాయం పెంపొందుతుందని ఐసీఎస్ఎస్ఆర్ పీడీఎఫ్ స్కాలర్ హర్షభార్గవి పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో పంచగవ్య ఉత్పత్తుల తయారీ - ఆర్థిక సాధికారత అంశంపై శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దేశీయ ఆవు పాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, గోమయం ఆధారంగా తయారు చేసిన పలు ఉత్పత్తులు తయారు చేయడం, వినియోగం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. తక్కువ పెట్టుబడితో తయారు చేసిన ఈ ఉత్పత్తులతో మంచి ఆదాయాన్ని గడించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం ఉష ప్రాజెక్టు డైరెక్టర్ ప్రొఫెసర్ వాణి, సభ్యురాలు ప్రొఫెసర్ ఆర్. ఉష, ఇంటర్నేషనల్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో హోంమంత్రి అనిత





పద్మావతీ అమ్మవారి ఆలయంలో హోంమంత్రి అనిత - శ్రీవారి ఆలయం వద్ద నిరోషా

తిరుమల శ్రీవారిని శనివారం రాష్ట్ర హోంమంత్రి అనిత దర్శించుకున్నారు. ఇంకా ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, సినీనటి నిరోషా, ఆస్ట్రేలియా కౌన్సిల్ జనరల్ శిలాయ్ జాకీ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. అంతకుముందు హోంమంత్రి అనిత శ్రీకాళహస్తీశ్వరుడిని, పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు. నిరోషా పరశురామేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## ముక్కంటి ఆలయంలో పాము కలకలం

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోకి పాము చొరబడటంతో కలకలం రేగింది. ఆలయంలో రూ.750 రాహుకేతు పూజా మండపం వద్ద శనివారం సాయంత్రం భారీ జెర్రిపోతు పూజా సామగ్రి మూటల వద్ద కనిపించింది. దీంతో భక్తులు ఉలిక్కిపడ్డారు. ఆలయాధికారులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. అటవీ శాఖ ఉద్యోగి దాము ఆలయం వద్దకు చేరుకుని పామును పట్టుకుని కైలాసగిరి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

పామును పట్టుకుంటున్న దాము




## సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**గురువారం హుండీ ఆదాయం : రూ.4.23 కోట్లు**

**శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,576**

**తలనీలాలు సమర్పించినవారు: 25,227**







# సాగులో 'డ్రోనాస్త్రం'

- అన్నదాతకు అన్నింటా వెన్నుదన్నుగా డ్రోన్
- 80శాతం సబ్సిడీతో అందజేస్తున్న ప్రభుత్వం
- వ్యవసాయంలో ఇప్పుడీ పరికరానిదే కీలకపాత్ర

**వ్యవసాయంపై అన్నదాత పెదవి విరుస్తున్న క్రమంలో ఆధునిక సాంకేతికత ఓ తీయని కబురందించింది. ఎగిరే ఓ అద్భుత యంత్ర పరికరాన్ని రూపొందించి అండగా నిలిచింది. దీన్ని అందిపుచ్చుకుంటే సాగులో లాభాలు పొందవచ్చునని భరోసా ఇచ్చింది. కూలీలు దొరకలేదని, ఖర్చు పెరుగుతోందని డీలా పడుతున్న రైతులకు డ్రోన్ రూపంలో చేదోడువాదోడుగా ఉంటోంది.**

**- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి**



డ్రోన్ ద్వారా మందు పిచికారీ చేస్తున్న రైతు

డ్రోన్ల ప్రవేశంతో వ్యవసాయం తీరు మారింది. నైరాశ్యంలో కొట్టుమిట్టాడే రైతన్నలకు ఇది కొండంత అండగా నిలిచింది. సాగులో ఎదుర్కొంటున్న పలు సమస్యలకు చక్కని పరిష్కారం చూపుతోంది. పదిమంది కూలీలు చేసే పనిని తానొక్కటే చేసి చూపిస్తూ అన్నదాతకు ఆసరా అవుతోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ రంగాన్ని ఊపందించేందుకు డ్రోన్లను ప్రభుత్వం కారుచౌకగా అందిస్తోంది. రైతులు కూడా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఫలితంగా జిల్లాలో డ్రోన్ల వినియోగం పెరుగుతోంది. పెట్టుబడి భారాన్ని తగ్గించుకుంటూ నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో సఫలీకృతమవుతున్నారు.



### ఆగస్టు నుంచి మరిన్ని డ్రోన్లు

జిల్లాలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.52 కోట్లు వెచ్చించి 36డ్రోన్లను పంపిణీ చేసింది. సబ్సిడీ కింద రూ.2.82కోట్లు చెల్లించింది. డ్రోన్ల వినియోగంపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన వచ్చింది. డ్రోన్లపై కొంతమంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆగస్టు నుంచి మరిన్ని కేటాయించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం.

- ప్రసాదరావు, జిల్లా వ్యవసాయాశాఖాధికారి



సబ్సిడీ కింద రైతులకు డ్రోన్లు అందిస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

### పిచికారీలో ప్రధాన పాత్ర

జిల్లాలో ప్రతి మండలానికీ 80శాతం రాయితీతో ప్రభుత్వం డ్రోన్లు మంజూరు చేసింది. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో వీటిని ఇప్పటికే అందజేసింది. మారుమూల గ్రామీణ ప్రాంత రైతులు సైతం ఇప్పుడు డ్రోన్ల సాయంతో సాగులో చకచకా దూసుకుపోతున్నారు. సమయం ఆదాతోపాటు పెట్టుబడీ తగ్గుతుండటంతో డ్రోన్ల వ్యవస్థపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

### డ్రోన్ కావాలంటే ఇలా చేయాలి

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం నీరుగారింది. మందు పిచికారీ చేయాలంటే డ్రోన్‌ను అద్దెకు తీసుకోవాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక డ్రోన్ల వ్యవస్థను బలోపేతం చేయాలని సంకల్పించింది. కనీసం ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడితే చాలు. పదవ తరగతి లేదా ఐటీఐ చదివి డీజీసీఏ నిబంధనల ప్రకారం పాస్‌పోర్టు ఉండాలి. గ్రూప్‌లోని ఒక రైతుకు డ్రోన్ వినియోగంపై 12రోజుల పాటు గుంటూరులో శిక్షణ ఇస్తారు. డ్రోన్ ఖరీదు రూ.9.80లక్షలు. ఇందులో రైతుల సంఘం రూ.2లక్షలు చెల్లిస్తే మిగతా రూ.7.84 లక్షలు బ్యాంకు రుణంగా సమకూర్చుతుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం 80శాతం రాయితీ కింద 7.84లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది.



డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



### సమయం ఆదా అవుతోంది

ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్‌లను అందజేస్తుండటం శుభపరిణామం. నాకు 20 ఎకరాల పొలముంది. గతంలో ఎకరాకు 200లీటర్ల నీరు నింపి పవర్‌స్ప్రే ద్వారా రెండు గంటల పాటు మందు పిచికారీ చేయాల్సి వచ్చేది. డ్రోన్ ద్వారా ఎకరాకు 10 లీటర్ల పురుగుల మందును 8 నిమిషాల్లోనే స్ప్రే చేస్తున్నాం. సమయం ఆదాతో పాటు కూలీల కొరత కూడా తీరింది.

- మస్తాన్ బిలాల్, రైతు, కల్లూరు గ్రామం, డీవీసత్రం



### సాగు ఖర్చు తగ్గింది

నాకు 60 ఎకరాల పొలం ఉంది. సంవత్సరంలో రెండుసార్లు పంట పండిస్తాం.డ్రోన్ సాయంతో సమయం ఆదా అవుతోంది. ఖర్చు కూడా తగ్గుతోంది. కొన్ని దీర్ఘకాలిక తెగుళ్లకు డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ చేయడంతో దిగుబడి పెరిగింది. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

- చంద్రశేఖర్, రైతు, సత్యవేడు



### అధిక దిగుబడి సాధిస్తున్నాం

మాకు 16 ఎకరాల పొలం ఉంది. ఇద్దరు వ్యక్తులు రోజుకు ఐదెకరాల్లో పురుగుల మందు పిచికారీ చేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో మాకు డ్రోన్లు ఇవ్వడంతో తక్కువ సమయంలోనే పిచికారీ చేస్తున్నాం. డ్రోన్‌తో స్ప్రే చేయడం వల్ల ప్రతి ఆకుపై నేరుగా మందు పడుతోంది. దీంతో అధిక దిగుబడి సాధిస్తున్నాం.

- ప్రేమ్‌కుమార్, రైతు, చిన్నకనపర్తి, తొట్టంబేడు మండలం.



వరి, మామిడిపై మందు పిచికారీ చేస్తున్న డ్రోన్

## రైతులను పట్టించుకోవడం లేదు

- కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూలై 26(ఆంధ్రజ్యోతి): రైతుల బాధలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, రాజ్యసభ మాజీ సభ్యుడు నర్రెడ్డి తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, మిర్చి, పొగాకు, మామిడి, చీనీ, పసుపు ఇలా ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. పంట కొనేవారే కరువయ్యారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందడం లేదన్నారు. యూరియా కొరత తీవ్రంగా ఉందని, కాంప్లెక్సు ఎరువుల ధరలు అమాంతంగా పెరిగాయని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతుకు రూ.20వేలు ఆర్థిక సాయం చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినా 14 నెలలు కావస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తే రాష్ట్రం వాటిని వేరే కార్యక్రమాలకు మళ్లించారని ఆరోపించారు. వైసీపీ, టీడీపీ దొందూదొందేనని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తిరుపతి నగర అధ్యక్షుడు చిట్టిబాబు, పీసీసీ కార్యదర్శి వెంకట నరసింహులు, నాయకులు చంద్రశేఖర్, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుప్పారెడ్డిపాళెంలో తమిళనాడు పోలీసుల విచారణ



దొరవారిసత్రం, జూలై 26(ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఆరంబాకంలో ఐదేళ్ల బాలికపై ఈనెల 12న లైంగిక దాడికి పాల్పడిన అసోం రాష్ట్రానికి చెందిన రాజ్ విశ్వకర్మను శుక్రవారం సూళ్లూరుపేటలో తమిళనాడు పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసు విచారణలో భాగంగా రాజ్ విశ్వకర్మను వెంట బెట్టుకుని ఆరంబాకం పోలీసులు శనివారం దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాళానికి వచ్చారు. అక్కడ హైవే పక్కన గల డాబాలో నిందితుడు పనిచేస్తున్నట్లు విచారణలో చెప్పడంతో దాన్ని పరిశీలించి, చుట్టుపక్కల వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అతని కుటుంబ వివరాలు కూడా సేకరిస్తున్నారు.

## రైలులో నుంచి పడి కానిస్టేబుల్ మృతి



అశోక్ మృతదేహం

వెంకటగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి పడి కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన శనివారం తెల్లవారుజామున వెంకటగిరి - గూడూరు రైలు మార్గంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. డక్కిలి మండలం సంఘనపల్లి గ్రామానికి చెందిన ఎస్.అశోక్(35) వెంకటగిరి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శనివారం విధులకు హాజరయ్యే నిమిత్తం గూడూరు నుంచి రైలులో వెంకటగిరికి బయలుదేరాడు. వెంకటగిరి సమీపంలో ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే కీమెన్ గుర్తించి గూడూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని గూడూరుకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## ఉవ్వెత్తున ఎగసిన 'గంగ'

- మంగళంలో ఊడిపోయిన తెలుగుగంగ పైపులైన్ ఎయిర్‌వాల్వ్

తిరుపతి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరశివారు ప్రాంతం మంగళంలోని తిరుమలనగర్‌కు వెళ్లే మలుపు వద్ద శనివారం మధ్యాహ్నం తెలుగుగంగ పైపులైన్ ఎయిర్‌వాల్వ్ ఊడిపోయింది. నీరు దాదాపు 10 మీటర్ల ఎత్తు ఎగసిపడ్డాయి. మూడుసార్లు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పంపింగ్‌స్టేషన్ నుంచి ఫిల్టర్‌హౌస్‌కు సరఫరా అవుతున్న రా వాటర్ స్తంభించింది. ఫిల్టర్‌హౌస్ ఎత్తులో ఉండడంతో నీరు ఒక్కసారిగా వెనక్కి తన్నింది. దీంతో కరకంబాడీ ప్రధాన రహదారి పక్కనున్న ఎయిర్‌వాల్వ్ ఊడిపోయింది. పైపు నుంచి నీరు ఒక్కసారిగా ఉప్పొంగింది. పది మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడుతూ పక్కనే ఉన్న నివాసం మీదకు పడ్డాయి. కిటికీ నుంచి లోపలికి నీరుచేరడంతో ఇంట్లోని వారు బయటకు పరుగులు తీశారు. ప్రవాహ ఉధృతికి ఇంటిపైనున్న ట్యాంకు పైపులు పగిలిపోయాయి. చెత్తనిల్వ చేసే సిమెంట్ కట్టడం కూలిపోయింది. ఇంతలో పంపింగ్‌స్టేషన్‌లో గేటువాల్వ్ ఓపెన్ చేయడంతో నీటి ఉధృతి తగ్గింది. అప్పటికే లక్షల గ్యాలన్ల నీరు వృథా అయ్యాయి. తెలుగుగంగ ఏఈ పవన్‌కుమార్ రెడ్డి అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ అంతరాయం మూలాన జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.





ఊడిపోయిన తెలుగంగ పైపు ఎయిర్‌వాల్వ్ - ఉవ్వెత్తున ఎగసిపడుతున్న నీరు

## గన్‌మెన్లతో సామాన్లు మోయించడం ఏమిటీ...?

- పెద్దిరెడ్డి తీరుపై హోంమంత్రి అనిత పరోక్ష వ్యాఖ్యలు

తిరుచానూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'ఎంతో శిక్షణ పొంది మన రక్షణ కోసం వచ్చిన గన్‌మెన్ల వద్ద సామాన్లు మోయించడం ఏమిటి..? గన్‌మెన్ అంటే మీ ఇంట్లో పనిచేసేవారు కాదుకదా... ఎవరి పనులు వారు స్వతంత్రంగా చేసుకోనివ్వండి' అంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై హోంమంత్రి అనిత పరోక్షంగా వ్యాఖ్యానించారు. తిరుమల వెంకన్నను, తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని ఆమె శనివారం దర్శించుకున్నారు.తిరుచానూరు ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గన్‌మెన్ అనేవారు వ్యక్తిగత భద్రత కోసమేనని, అలాంటి వారిని వ్యక్తిగత పనుల కోసం వాడుకోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.తనకు గొడుగు పట్టుకుని వస్తే కూడా ఒప్పుకోనన్నారు. కూటమి ప్రభుత్వంలో నిజాయితీగా పనిచేసుకోవచ్చన్నారు. లిక్కర్ స్కామ్ విచారణ వేగవంతంగా జరుగుతోందని, దర్యాప్తు పారదర్శకంగా సాగుతోందన్నారు. ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయలేదన్నారు.ఎమ్మెల్యేలపై రోజా చేసిన వ్యాఖ్యలపై అనిత స్పందిస్తూ నాయకులు ఆదర్శంగా ఉండాలని, ఫ్రస్ట్రేషన్ తట్టుకోలేక నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదని అన్నారు. ఇలాంటి చర్యలను ప్రజలు అస్యహించుకుంటున్నారన్నారు. సభ్యత, సంస్కారం లేనివారి గురించి మాట్లాడడం అంటే సమయం వృథా అన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ కరెక్ట్‌గా ఉందన్నారు. క్రైమ్ రేటు కూడా తగ్గిందన్నారు.పోలీసుశాఖలో డ్రోన్ కెమెరాల వ్యవస్థ రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందన్నారు.



తిరుమల ఆలయం వద్ద హోంమంత్రి అనిత

## క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో వైద్యం

తిరుపతి(వైద్యం), జూలై 26(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందించేందుకు టాటా క్యాన్సర్ ట్రస్టు అన్నివిధాలా కృషి చేస్తోందని టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ అన్నారు. జూపార్కు రోడ్డులోని టాటా క్యాన్సర్ ఆస్పత్రిలో శనివారం జాతీయ క్యాన్సర్ గ్రిడ్ - ఏపీ స్టేట్ ఛాప్టర్ 3వ వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ ఆస్పత్రులు, పరిశోధన సంస్థలు, సేవా సంస్థలతో కలిసి 2012లో టాటా మెమోరియల్ సెంటర్ ఎన్‌సీజీ(జాతీయ క్యాన్సర్ గ్రిడ్)ను స్థాపించిందన్నారు. క్యాన్సర్‌ను గుర్తించడం, అవసరమైన వైద్యం అందించడం, నివారించడం ఎన్‌సీజీ లక్ష్యమన్నారు. క్యాన్సర్‌ను సమూలంగా నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల గురించి వర్చువల్లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు వివరించారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుంచి హాజరైన క్యాన్సర్ వైద్య నిపుణులు వారి అనుభవాలను, అభిప్రాయాలను వివరించారు.

## 104 వాహనం ఢీకొని రైతు మృతి



సుబ్రహ్మణ్యంరెడ్డి (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 104 వాహనం ఢీకొని రైతు మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి మండలం ఉడమలపాడు వద్ద శనివారం చోటుచేసుకుంది. ముచ్చివోలు గ్రామానికి చెందిన పి.సుబ్రహ్మణ్యంరెడ్డి(49) ఆదివారం గ్రామంలో షిర్డీ సాయిబాబా ఉత్సవం, ఊరేగింపు ఉండడంతో సరుకుల కోసం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వచ్చాడు. సరుకులను ఆటోలో వేసి బైక్‌లో తిరిగి వెళుతుండగా ఉడమలపాడు వద్ద ద్విచక్ర వాహనాన్ని 104 ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## పాఠశాల విలీనంపై ఆగ్రహం

- టీచర్లను చుట్టుముట్టిన గ్రామస్తులు



కేవీబీపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని అనంతపద్మనాభపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులు చుట్టుముట్టారు. అనంతపద్మనాభపురం విద్యార్థులను విలీనం పేరుతో పక్కనున్న గుంటిపేడు గ్రామానికి వెళ్లాలని విద్యాశాఖ అధికారులు సూచించగా అందుకు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాఠశాలకు తాళం వేసి నిరసన తెలుపుతున్నారు. ఉపాధ్యాయులు రోజూ వచ్చి పాఠశాల బయట కూర్చుని వెళ్లిపోతున్నారు. తల్లిదండ్రులకు అర్థమయ్యేలా వివరించాలని ఎంఈవో ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో శనివారం ఉపాధ్యాయులు పాఠశాల తాళం తీయడంతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు ఇద్దరు ఉపాధ్యాయులను చుట్టుముట్టారు. తమ పిల్లలకు చదువు లేకపోయినా పర్వాలేదు గాని వేరే పాఠశాలకు పంపేది లేదని తెగేసి చెప్పారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌బాబు అక్కడికి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి, టీచర్లను అక్కడి నుంచి పంపించారు. సోమవారం నుంచి పాఠశాలకు రావద్దని గ్రామస్తులు ఉపాధ్యాయులను హెచ్చరించారు.



తైవాన్ ప్రతినిధులకు శ్రీసిటీ గురించి వివరిస్తున్న శివశంకర్

## శ్రీసిటీలో తైవాన్ వ్యాపార ప్రతినిధుల బృందం

సత్యవేడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా తైవాన్‌కి చెందిన 14మంది వ్యాపార ప్రతినిధుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బ్రాండెడ్ అథ్లెటిక్, క్యాజువల్ ఫుట్‌వేర్ తయారీదారు పౌచెన్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మార్క్‌లిన్ నేతృత్వంలో విచ్చేసిన ఈ బృందానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, శ్రీసిటీ తరపున మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలను వివరించారు. తైవాన్‌కు చెందిన రెచి ప్రెసిషన్ సంస్థ శ్రీసిటీలో డైకిన్‌తో కలిసి ప్లాంట్ ఏర్పాటు చేసిన విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు వికాస్ మర్మత్, రంజిత్, గీతాంజలి, ఇన్వెస్ట్ ఇండియా ప్రతినిధి మనీష్‌తివారీతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య ముఖ్య కార్యదర్శి డాక్టర్ యువరాజ్ వర్చువల్‌గా తైవాన్ బృందంతో చర్చించారు.

## ఇద్దరు ఎర్రచందనం దొంగల అరెస్టు



పట్టుబడిన ఎర్రచందనం నిందితులు

ఎర్రావారిపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి); ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. తలకోన సెంట్రల్ బీట్ పరిధిలోని దద్దిలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దొంగలు ఉన్నట్లు ముందస్తు సమాచారం అందింది. ఈ మేరకు అటవీ శాఖ సిబ్బంది శనివారం కూంబింగ్ నిర్వహించారు. వీరికి 9మంది ఎర్రచందనం దొంగలు తారసపడ్డారు. పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు దొరికారు. మిగిలిన వారు పరారయ్యారు. పట్టుబడిన వారిని సోమల మండలం అన్నెంగారిపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన వీరప్ప, శివయ్యలుగా గుర్తించారు. సంఘటన స్థలంలో రెండు ద్విచక్ర వాహనాలతో పాటు 311 కేజీల బరువున్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వెంకటరమణ తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ రూ.13 లక్షలు ఉంటుందన్నారు. దాడిలో అధికారులు ప్రదీప్, సల్లావుద్దీన్, రాజేష్ కుమార్, డ్రైవర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ప్రయాణంపై 30న ఆర్టీసీ ఉన్నతస్థాయి సమావేశం

తిరుపతి(ఆర్టీసీ),జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్న నేపథ్యంలో ఈ నెల 30న తిరుపతిలో ఆర్టీసీ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనుంది. ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు, ఈడీలు, ఇతర ఉన్నతాధికారులు మంగళవారం తిరుపతికి చేరుకోనున్నారు. స్థానిక విద్యాపీఠం కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం కానున్నారు. రాయలసీమ ఉమ్మడి జిల్లాలైన చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం సంబంధించిన డీపీటీవోలు, డిప్యూటీ సీటీఎంలు, సీఎంఈలు, పీవో, ఇతర అధికారులు, 54 డిపోల మేనేజర్లు హాజరు కావాలని ఇప్పటికే ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# పుత్తూరు వార్తలు

## ప్రజా సంక్షేమమే పరమావధి: ఎమ్మెల్యే


నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జూలై 26(ఆంధ్ర జ్యోతి): ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నామని, గత ఐదేళ్ల పాలనలో జరిగని అభివృద్ధిని సంవత్సరంలో చేసి చూపామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం తిరుపతిలోని ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని టీడీపీ మండల అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జీలతో సమీక్ష నిర్వహించారు. సంక్షేమమే లక్ష్యంగా పథకాల అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వ పనితీరును మండలాల్లో పర్యటించి వివరించాలని సూచించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు.సాయంత్రం ఉభయ నాంచరులతో వెంకన్నను సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి ఊయలపై అధిష్ఠింపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం పద్మావతి, ఆండాల్ సమేత సర్వాలంకార భూషితుడైన ప్రసన్న వేంకటేశ్వరుడిని మేళతాళాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు.ఆలయ అధికారి వేణుగోపాల్‌రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పీ4లో మార్గదర్శకంగా నిలుద్దాం


సమావేశంలో ప్రసంగిస్తున్న మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఉన్నతికి ప్రతి ఒక్కరూ సంకల్పించాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, విద్యుత్, విద్య తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు పేదల కోసం ప్రతిష్ఠాత్మకంగా పీ4ని తీసుకొచ్చారని దీని విజయవంతానికి ప్రజా ప్రతినిధులు, వ్యాపారులు, వివిధ హోదాల్లో ఉన్న వ్యక్తులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, ఆరోగ్య పరిరక్షణ, వ్యవసాయం, నిర్మాణం అంశాల్లో సహకారం అందించవచ్చన్నారు. ఒక్కో పేద కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


దిగువగూళూరులో కరపత్రాల పంపిణీలో కరుణయాదవ్ తదితరులు

పుత్తూరు టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సారథ్యంలోనే సుపరిపాలన సాధ్యమైందని తడుకు సింగిల్‌విండో చైర్మన్ కరుణయాదవ్ చెప్పారు. మండలంలోని శిరుగురాజుపాళెం పంచాయతీ దిగువగూళూరు, పొట్టిగుట్టలు, శిరుగురాజుపాళెంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తడుకు పంచాయతీలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు బాలాజి, పార్టీ రూరల్ ప్రధాన కార్యదర్శి హేమంత్, ఏ.రవి, జె.రమేష్, మంగయ్య, వినోద్, బాలాజీ పాల్గొన్నారు.

## ది స్కూల్‌లో పింక్ డే




శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ది స్కూల్‌లో శనివారం కిండర్ గార్టెన్ విద్యార్థులతో పింక్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జనార్దన రావు పవార్ మాట్లాడుతూ పిల్లలు ఈ దశలోనే రంగులను బాగా గుర్తిస్తారన్నారు. పింక్ రంగులో ఉండే పండ్లు, ఆహారం తీసుకుంటే కలిగే ఉపయోగాల విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. హెచ్ఎం విశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కళత్తూరు దళితవాడలో తాగునీటి ఇబ్బందులు

కేవీబీపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు దళితవాడలో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో గ్రామస్తులు పోలాల్లో బోర్లను ఆశ్రయిస్తున్నారు. బోరు మోటరు మరమ్మతులకు గురై స్టార్టర్ కాలిపోవడంతో ఈ సమస్య తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

## భూ సారం పెంపునకే నవధాన్యాలు

పిచ్చాటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): భూ సారం పెంపొందించడానికి నవధాన్యాలు విత్తాలని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. శనివారం మధ్యాహ్నం కీళపూడి రైతు సేవాకేంద్రంలో నవధాన్యాలను ఆయన పంపిణీ చేశారు. నవధాన్యాలు విత్తితే పచ్చిరొట్ట తరహాలో భూ సారం పెరుగుతుందన్నారు. నవధాన్యాలు కిట్ రూ.650 అని, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, డిల్లీబాబు, ఎంపీడీవో మహ్మద్‌రఫి ఏవో, వ్యవసాయ శాఖ సహాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

పిచ్చాటూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాలను ఆదుకోవడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. శనివారం పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో బాలిక జీవిత తండ్రి జయచంద్రకు రూ.2,70,406 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందించారు. ఇళంగోవన్‌రెడ్డి, పద్దురాజు, రాజేశ్వరి, రాజేంద్రన్, డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనీయుడు అబ్దుల్‌కలాం


మొక్కలు నాటుతున్న జడ్జి వెంకట నాగపవన్

గూడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆదర్శనీయుడని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అబ్దుల్‌కలాం దేశానికి ఎనలేని కృషి చేశారన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సులోచనారాణి, ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, న్యాయవాది పార్వతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నాయుడుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తామని, వినియోగదారులు బిల్లులు చెల్లించవచ్చని ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసులు తెలిపారు.

రెండు వంతెనలు, హైవే దాటి..

# పిల్లలను బడికి పంపలేం

- పాఠశాల విలీనంపై తల్లిదండ్రుల నిరసన
- డిగ్రీ యువతి చేత చదువు చెప్పిస్తున్న వైనం


పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన


సుభాషిణి వద్ద చదువుకుంటున్న విద్యార్థులు


లింగంపాడు పాఠశాలకు వెళ్లే దారిలో రైల్వే వంతెన కింద వర్షపు నీరు

దొరవారిసత్రం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం అయ్యపాళెం పాఠశాలలోని 3, 4, 5 తరగతులను ఆ గ్రామానికి రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న తల్లంపాడు పంచాయతీ లింగంపాడు పాఠశాలలో విలీనం చేశారు. దీంతో అయ్యపాళెం పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు లింగంపాడుకు వెళ్లాల్సి వచ్చింది. అయితే ఇందుకోసం రెండు కిలోమీటర్ల నడక దారిలో పోలిరెడ్డిపాళెం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిని దాటుకొని వెళ్లాలి. ఈ వంతెన వద్ద వర్షం కురిస్తే పెద్దవాళ్లు కూడా మునిగిపోయే లోతు నీరు చేరుతుంది. రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకే వంతెన కింద నీరు చేరింది. దీంతో విద్యార్థులు వెళ్లలేని పరిస్థితి. అలాగే అయ్యపాళెం మార్గంలో జాతీయ రహదారికి సమీపంలో నెర్రికాలువపై మరో వంతెన ఉంది. పిట్టగోడలు కూడా లేని ఈ వంతెనపై చిన్నపిల్లలు నడిచి వెళ్లడం ప్రమాదకరం. అంతేకాకుండా టపాయిండ్లు వద్ద జాతీయ రహదారిని దాటి వెళ్లాలి. రహదారిని దాటే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. లింగంపాడు పాఠశాలకు వెళ్లడం సాహసంతో కూడిన పని కావడంతో నాలుగు రోజుల నుంచి విద్యార్థులను తల్లిదండ్రులు స్కూలు మానిపించేశారు. తమ గ్రామంలో పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న గ్రామానికి చెందిన యువతి సుభాషిణి చేత బడి బయటే విద్యార్థులకు చదువు చెప్పిస్తున్నారు. తమ ఊరి బడిలోనే 3, 4, 5 తరగతులను కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: పాశిం


ముట్టెంబాకలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ముట్టెంబాక, కల్లూరు, కొత్తపాళెం, సిద్ధిగుంటపాళెం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలనే అధికారులకు సూచించారు. అనంతరం ముట్టెంబాక అంగన్‌వాడీ టీచర్ సలోమీ, కల్లూరు కొత్తపాళెం అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణులకు చీర, జాకెట్, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదనరెడ్డి, నాయకులు ఉచ్చూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, దువ్వూరు జనార్దనరెడ్డి, కల్లూరు హరీష్ నాయుడు, నన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, నందగోపాల్‌రెడ్డి, దోశకాయల కృష్ణమూర్తి, కుంచం దయాకర్, పసుపులేటి రాజయ్య, నెల్లూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాభివృద్ధే సీఎం చంద్రబాబు ధ్యేయం: విజయశ్రీ


అక్కరపాకలో ఇళ్ల నివేశ గృహాల మంజూరు విషయమై స్థానికులు, హౌసింగ్ ఏఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ


దొరవారిసత్రం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో అక్కరపాక, పోలిరెడ్డిపాళెం, పూలతోట, ఆనేపూడి, సింగనాలత్తూరు పంచాయతీల్లో పర్యటించారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల సమాచారంతో కూడిన కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలంటినీ తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, సూళ్లూరుపేట ఏఎంసీ చైర్మన్ రమేష్, తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్ఐ అజయ్‌కుమార్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు నాయుడు, పామంజి శ్రీనివాసులు, మురళిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న రోటరీవెస్ట్‌క్లబ్ సభ్యులు

గూడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రోటరీ వెస్ట్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాలలో రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకంటి రామమోహన్‌రావు దాతృత్వంతో విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధ చూపాలన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, రాఘవరెడ్డి, బిల్లు చెంచురామయ్య, తాళ్లూరు శ్రీనివాసులు, ధనుంజయరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, హరినాథ్‌రెడ్డి, చెంచుకృష్ణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుగంగ ఏఈ మృతి


రాజశేఖర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, కృష్ణయ్య

కోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని రవినగర్‌లో నివాసం ఉంటున్న తెలుగుగంగ అసిస్టెంట్ ఇంజనీర్ పనబాక రాజశేఖర్(54) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య తదితరులు రాజశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు.

## పీ-4 కుటుంబాలపై సమీక్ష

కోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీ-4 కార్యక్రమంలో భాగంగా పలుశాఖల అధికారులతో సమీక్ష జరిగింది. ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించి బంగారు కుటుంబాలుగా దత్తత తీసుకునే విషయంపై చర్చించారు. సమావేశంలో డాక్టర్ నాగరాజు, ఆర్ఐ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్‌లో విజయ్ దివస్

కోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విజయ్ దివస్ నిర్వహించారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో కార్గిల్ యుద్ధంలో ప్రాణాలర్పించిన సైనికులకు నివాళులర్పించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ మాధవయ్య, పీడీ మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనకే పీ4

బాలాయపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసమే పీ4 కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వివిధశాఖల అధికారులతో పీ4 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1642 బంగారు కుటుంబాలను గుర్తించామని, ఆయా కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చే వారిని ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, రాయి సత్యం నాయుడు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీలో తనిఖీలు


పీహెచ్‌సీలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో హరిత

బాలాయపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో హరిత శనివారం తనిఖీ చేశారు. కాన్పులు, రక్త పరీక్షలు, ఓపీ గదులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యాధికారులు వెంకటరెడ్డి, లియోనాలకు పలు సూచనలు చేశారు. కాన్పుల గది ఉరుస్తోందని, టాయిలెట్లు లేవని, ఆస్పత్రి తలుపులు శిథిలావస్థకు చేరుకున్నాయని సిబ్బంది చెప్పడంతో మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## దేశాభివృద్ధికి కృషి చేయాలి

గూడూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ అన్నారు. శనివారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో సాయి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో మరణించిన సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో శివశంకర్, కిరణ్, మహేష్, ప్రదీప్, రాజు, ప్రణయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు.

## పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ కార్యాలయంలో శనివారం పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, సురేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగరాజు, మల్లికార్జున, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీసేవ జరిపారు.

## హోంమంత్రి అనితకు సత్కారం


హోంమంత్రి అనితను సన్మానిస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): హోంమంత్రి వంగలపూడి అనితను మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ సత్కరించారు. శనివారం హోంమంత్రి ముక్కంటిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బృందమ్మ ఆలయం వద్దకు చేరుకుని హోంమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి కలంకారీ శాలువాతో సత్కరించారు. అనంతరం హోంమంత్రి పట్టణంలోని భానోదయ కలంకారీ కేంద్రాన్ని సందర్శించారు. కలంకారీ వస్త్రాలను ఆరా తీశారు. నిర్వాహకులు పద్మావతి హోంమంత్రిని కలంకారీ వస్త్రంతో సత్కరించి వెంకటేశ్వరస్వామి కొమ్మ బొమ్మను బహూకరించారు.

## టీడీపీతోనే సంక్షేమం సాధ్యం

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం పద్మశాలిపేటలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, పేట బాలాజీరెడ్డి, కిషోర్, మునిరాజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లిపట్టు నాగరాజుకు సత్కారం


నాగరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వరదయ్యపాళెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత, కవి, స్థానిక జడ్పీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు పల్లిపట్టు నాగరాజును ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. నాగరాజు రచించిన యాలై పూడ్సింది కవితా సంపుటిని ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎంఏ తెలుగు ఆధునిక కవిత్వ విభాగంలో తెలుగు విద్యార్థులకు రెండవ సెమిస్టర్‌లో పాఠ్యాంశంగా చేర్చడంపై హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల హెచ్ఎం రమణయ్య ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ... నాగరాజును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు సరస్వతి, వాణి, శ్రీధర్, గురవయ్య, పురుషోత్తం, సరళ, సుబ్రమణ్యం రాజు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

సూళ్లూరుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని బజారు వీధులు, జీఎన్‌టీ రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అడ్డదిడ్డంగా నిలిపిన వాహనదారులకు, జీఎన్‌టీ రోడ్డు వెళ్లే వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బజారు వీధులు, ప్రధాన కూడలి ప్రాంతాల్లో దుకాణదారులు హద్దులు దాటి ముందుకు రాకూడదన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, తడ, శ్రీహరికోట ఎస్ఐలు బ్రహ్మానాయుడు, కొండపనాయుడు, స్వప్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

సూళ్లూరుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డివిజన్ పరిధిలో ఉన్న పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంపెనీల్లో పనిచేసే సిబ్బంది ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా రక్షణ కల్పించాల్సిన బాధ్యత కూడా పరిశ్రమలదేనని స్పష్టం చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారు కేటగిరి ప్రకారం ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారు.. ఏ వస్తువులు తయారు చేస్తున్నారు.. ఎలాంటి భద్రత చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలు నోటీసు బోర్డులో వెల్లడించాలని, నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, పరిశ్రమల భద్రతా విభాగాధికారి శివశంకర్ రెడ్డి, తహసీల్దార్ గోపినాథరెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలపై అభిప్రాయ సేకరణ

సూళ్లూరుపేట, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల సమస్యలపై నాయకుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల భవనాల స్థితి, సమస్యాత్మకంగా ఉన్న వాటి వివరాలడిగి తెలుసుకున్నారు. అధికంగా ఓటర్లు ఉండే ప్రాంతంలో మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఓటర్లు, చేర్పులు మార్పుల వివరాలు బూత్ స్థాయి అధికారులు నాయకులకు అందజేయాలన్నారు. సమావేశంలో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, నాయుడుపేట తహసీల్దార్లు రవీంద్రనాథ్ రెడ్డి, శరత్‌బాబు, శైలాకుమారి, రాజేంద్ర పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో హోం మంత్రి



శ్రీకాళహస్తి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 31లోగా మార్గదర్శకులను గుర్తించండి



దిశానిర్దేశం చేస్తున్న కమిషనర్ సంజీవకుమార్

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనలో భాగంగా పీ4 విధానానికి శ్రీకారం చుట్టిందని పురపాలక సంఘ కమిషనర్ సంజీవకుమార్ తెలిపారు. శనివారం పురపాలకసంఘ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. అట్టడుగున ఉన్న 20శాతం పేద కుటుంబాలను సంపన్న వర్గాలు దత్తత తీసుకోవాలని కోరారు. శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో గుర్తించిన 1,611 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి మార్గదర్శకులను గుర్తించి ఈనెల 31 లోపు ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. బంగారు కుటుంబాల అవసరాలపై సర్వే చేపట్టి ఆగస్టు 4వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలకసంఘ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమమే టీడీపీ అజెండా

నారాయణవనం, జూలై 26(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల సంక్షేమమే తెలుగుదేశం అజెండా అని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి అన్నారు. సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని పాలమంగలం సౌత్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గిరిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి షణ్ముగం, యాచేంద్రనాయుడు, సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

**నాగలాపురం (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి గాంధీ విగ్రహం వరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం పంచాయతీల్లో మిగులు బడ్జెట్ ఉండడంతో అన్ని విధాలా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. నాగలాపురం మండలంలోని 19 పంచాయతీలకు చెందిన మహిళా సంఘాలకు రూ.2 కోట్ల స్త్రీనిధి చెక్కులను పంపిణీ చేశారు. సెల్వకుమార్, మురళి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పిచ్చాటూరు ఏర్పేడు (ఆంధ్రజ్యోతి):** మండలంలోని వికృతమాలలో ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. అర్హత ఉండీ పథకం అందని వారుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీడీపీ నాయకులు నాగరాజునాయుడు, పొన్నా రావు, గురవారెడ్డి, హేమాక్షిరాయల్, మురళిరెడ్డి, ధనంజయులునాయుడు, శివశంకర్‌రెడ్డి, మురళి, బాబునాయుడు, చలపతి, చిరంజీవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డదిడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు



పంచాయతీ కార్యదర్శికి సూచనలిస్తున్న డీఎస్పీ

రేణిగుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి): వారపు సంతలో అడ్డదిడ్డంగా, రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం ఉదయం వారపు సంతను పంచాయతీ కార్యదర్శి మాధవితో కలిసి పరిశీలించారు. అడ్డదిడ్డంగా దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో ప్రతి శనివారం ఉదయం నుంచే ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. లగేజీ ఆటోలను ఎక్కడబడితే అక్కడ ఏర్పాటు చేస్తుండడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందన్నారు. ఇలాంటి వారికి ప్రత్యేక స్థలం కేటాయించాలని పంచాయతీ కార్యదర్శికి, సంత కాంట్రాక్టరుకు సూచించారు. ఎస్ఐలు సుధాకర్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

## గంజాయిపై సమాచారం ఇవ్వండి



ట్యాక్సీ డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎక్సైజ్ సీఐ

రేణిగుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి రైళ్లల్లో గంజాయి తరలిపంపై సమాచారం ఇవ్వాలని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఎక్సైజ్ సీఐ నరస నాయుడు సూచించారు. శనివారం రేణిగుంట రైల్వేస్టేషన్ ట్యాక్సీ స్టాండ్‌లో డ్రైవర్లకు గంజాయి, మత్తు పదార్థాల రవాణా చేస్తే తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో పట్టుబడుతున్న గంజాయి ఒడిశా ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి తరలుతున్నట్టు సమాచారం ఉందన్నారు. గంజాయి తరలింపు, అనుమానాస్పద వ్యక్తులపై టోల్ ఫ్రీ నెం.14405కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ అంజలిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వైద్యశిబిరం



హెల్త్ చెకప్ కరపత్రాల ఆవిష్కరణ

రేణిగుంట జూలై 26(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అమరా హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం కరకంబాడి సమీపంలోని అమరా హాస్పిటల్లో జరిగిన శిబిరంలో టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు మాట్లాడుతూ... టాస్క్‌ఫోర్స్‌లోని పోలీసులు, అటవీశాఖ ఉద్యోగులతోపాటు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రెండు రోజులు పాటు వార్షిక మెడికల్ చెకప్ చేయడానికి అమరా హాస్పిటల్ ముందుకు రావడం హర్షణీయమన్నారు. హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గౌరినేని ప్రసాద్, ఎండీ డాక్టర్ గౌరినేని రమాదేవి మాట్లాడుతూ... పుష్ప సినిమాలో ఉన్నది సినిమా హీరో అయితే, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రియల్ హీరోలని కొనియాడారు. శిబిరంలో రక్త, బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. హాస్పిటల్ జీఎం ఆనంద్, సీఈవో భాగ్యలక్ష్మి, డీఎస్పీలు బలిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏసీఎఫ్ జె.శ్రీనివాస్, ఆర్ఐలు కృపానంద, సాయిగిరిధర్, సీఐ సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు..

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంరెడ్డి



మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి - మునీశ్వరి

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు సూచనలతో మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన్ను పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సత్కరించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సహా పలువురు సుబ్రహ్మణ్యంరెడ్డికి అభినందనలు తెలిపారు.

**ఏర్పేడు (ఆంధ్రజ్యోతి):** తిరుపతి జిల్లా బీజేపీ కార్యదర్శిగా జగదాబి మునీశ్వరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశ పరిరక్షణ, మహిళా సాధికారత కోసం పనిచేసే బీజేపీ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## చిట్టి చేతులతో చిన్ని ప్రయోగాలు



శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో చిన్నారులు చేసిన ప్రయోగాలు చూడముచ్చటా ఉన్నాయి. నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు అట్టముక్కలతో వివిధ రకాల ఇళ్లు, టీవీ, రాకెట్ తదితర బొమ్మలను తయారు చేశారు. అంతే కాకుండా పాటలు పాడారు. ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. గైడ్ టీచర్‌గా హెచ్ఎం కె.బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

# శ్రీకాళహస్తి సత్యవేడు

### వైద్య శిబిరానికి స్పందన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలుగుగంగ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మంది వైద్య పరీక్షలను చేయించుకున్నారు. శ్రీకాళహస్తికి చెందిన శ్రీచరణ్ హాస్పిటల్ డాక్టర్ సాయిచరణ్ తేజ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.

## ముక్కంటి క్షేత్రం... పోటెత్తిన భక్త జనం



శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 511 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,304, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,447మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,696 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,092, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 325, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 310, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 103మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,800 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

### వెలుగులో ఆడిటింగ్ ప్రారంభం

సత్యవేడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెలుగు ఆర్థిక కార్యకలాపాలపై 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శనివారం నుంచి ఆడిటింగ్ ప్రారంభమైంది. ఆడిటర్ కార్తికేయ బృందం మహిళా సమాఖ్య ఆదాయ వ్యయాలు, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ తదితర పథకాలకు సంబంధించి 42 గ్రామ మహిళా సమాఖ్య సంఘాల ఆర్థిక వ్యవహారాలతో పాటు పాల శీతలీకరణ కేంద్రం ఆదాయ, వ్యయాలకు సంబంధించి ఆడిటింగ్ చేపట్టారు.

### స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై నిరసన

సత్యవేడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ మండలంలోని మదనంబేడులో సీపీఎం డివిజన్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల కడుపుకొట్టి, అదాని కంపెనీకి లాభాలు తెచ్చిపెట్టేందుకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరాటపడుతున్నాయని విమర్శించారు.

### చెంగాళమ్మ జాతర

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 26 (ఆందరజ్యోతి): మండలంలోని నీర్పాకోటలో కొలువై ఉన్న చెంగాళమ్మ జాతర రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేసిన ముగ్గు ఆకట్టుకుంది. జాతర సందర్భంగా చెంగాళమ్మకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ పైలు ముగ్గు, పోతురాజు ముగ్గు, శేషపాన్పు, కలిశ గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం చెంగాళమ్మ ఉత్సవమూర్తిని గ్రామంలో ఊరేగిస్తారు.

## ఘనంగా కార్గిల్ విజయ దివస్



శ్రీకాళహస్తి కార్గిల్ సెంటర్ వద్ద అమర జవాన్లకు నివాళులు

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్లను స్మరించుకుంటూ శనివారం పట్టణం లోని కార్గిల్ సెంటర్‌లో మాజీ సైనికుడు పులిశ్రీకాంత్, న్యాయవాది పుష్పలత ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రూరల్ ఎస్ఐ నరసింహ రావు, ట్రాఫిక్ ఎస్ఐ గోవింద్ హాజరయ్యారు. భారత సైన్య శౌర్యం, త్యాగానికి నిదర్శనం కార్గిల్ యుద్ధమన్నారు. కొట్టే సాయి, గరికపాటి చంద్రశేకర్, మాజీ సైనికులు సుబ్బారెడ్డి, కిషోర్‌నాయుడు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

**వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాధమ్మ, స్వచ్ఛత రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 1999 కార్గిల్ యుద్ధంలో అమరుడైన భారత సైన్యాధికారి మరియప్పన్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి రవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో భగవద్గీత పారాయణం



సత్యవేడు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ప్రసన్న వేంకటేశ్వరాలయంలో శనివారం స్థానిక చిన్మయ పాఠశాలల విద్యార్థులు భగవద్గీత పారాయణం చేశారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొని పురుషోత్తమ ప్రాప్తయోగ విశిష్టతపై పారాయణం చేశారు. శ్రీవాణి నిర్వాహకులు విద్యార్థులకు ప్రత్యేక బహుమతులను అందించారు. శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, పీబీఎస్ శాస్త్రి, పల్లేటి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలిద్దామని ఏపీ యానాది సంఘం అధ్యక్షుడు చందమామల కోటయ్య పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని చెంచులక్ష్మి యానాదికాలనీ మహిళలకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలు చేయడం వలన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటీఎం నరసింహులు, సీసీ జగదీష్, కే.వీ.సత్యనారాయణ, వెంకటలక్ష్మి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాలు కల్పించండి

ఏర్పేడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): వికృతమాల పంచాయతీలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ నాయకుడు సీహెచ్ శివకుమార్ కోరారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో జగనన్న కాలనీలో వారు పర్యటించారు. గతప్రభుత్వం భాగ్యనగరాలు నిర్మిస్తామని పేదలకు స్థలాలు కేటాయించిందే కానీ మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. రమేష్, ప్రసాద్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

### జీవన నైపుణ్యాలపై శిక్షణ



విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రధానోపాధ్యాయుడు గోపి

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాయపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, కెరీర్ గైడెన్స్‌పై శనివారం శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా సమస్యలను అధిగమించాలో ప్రగతి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నారాయణ అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఉంటే స్నేహితులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గోపి, ప్రగతి సంస్థ శ్రీకాళహస్తి సమన్వయకర్త చంద్రశేఖర్, కో-కన్వీనర్ రామచంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని హెచ్ఎం వాణి అన్నారు. మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో మొక్కల పెంపకంపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. గ్రీన్ పాస్‌పోర్టు పేరుతో తరగతుల వారీగా విద్యార్థులకు మొక్కలను ఎకో క్లబ్ సమన్వయకర్త లక్ష్మయ్య అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాస్‌పోర్టులో మొక్క వ్యవహార నామం, సాంకేతిక నామం, ఏ తేదీన, ఏ ప్రాంతంలో మొక్కను నాటారనే వివరాలను పొందుపరచాలన్నారు. విద్యార్థులు తమకు ఇచ్చిన మొక్కకు పేరు పెట్టి నాటి సంరక్షించాలన్నారు. తరువాత మూడు నెలలకోసారి మొక్క ఎదుగుదల స్థితిని పాస్‌పోర్టులో నమోదు చేయాలన్నారు.

### వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

### పరశురామేశ్వరుడి సేవలో సినీనటి నిరోషా



ఏర్పేడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని శనివారం ప్రముఖ సినీ నటి నిరోషా తన స్నేహితులతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈవో రామచంద్రారెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితుడు పవన్ కుమార్‌శర్మ వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

### విమానాశ్రయంలో విజయ్ దేవరకొండ సందడి



రేణిగుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి): సినీ హీరో విజయ్ దేవరకొండ తిరుపతి విమానాశ్రయంలో సందడి చేశారు. శనివారం కింగ్డమ్ సినిమా ట్రైలర్ రిలీజ్ సందర్భంగా హైదరాబాదు నుంచి తిరుపతి విమానాశ్రయానికి శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇండిగో విమానంలో ఆయన చేరుకున్నారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీపడ్డారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

### విద్యాశాఖ కార్యాలయం తనిఖీ

ఏర్పేడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ కార్యాలయాన్ని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కేవీ.ఎన్ కుమార్ తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రగతి నివేదికలపై చర్చించారు. ప్రశ్నపత్రాలకు సంబంధించి వివరాలను అడిగితెలుసుకోవడం కోసం ఎస్ఎస్ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ప్రేమలత, దయాకర్‌రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.